ఓం నారాయణ - ఆదినారాయణ

# అవధూత లీల

## అధ్యాయము - 22

## శ్రీస్వామివారి సూక్తులు



1. "బ్రేవ్‌మని త్రేపే వాడికి కాదయ్యా, ఆకలై కొంగుపట్టేవారికి అన్నం పెట్టాలయ్యా".

2. "స్వామీ! కొందరు మిమ్మల్ని స్మరించిన వెంటనే రక్షణ పొందుతున్నారు. కొందరికి ఆలస్యమౌతుంది ఏమిటి" అని అడిగితే "వాళ్ళుండేదాన్ని బట్టి గదయ్యా మనముండేది" అన్నారు. అంటే మన విశ్వాసాన్ని బట్టి శ్రీస్వామివారి రక్షణ లభిస్తుందన్నమాట.

3. "సంపూర్ణ విశ్వాసంతో ఇక్కడకొచ్చి ఏదనుకుంటే అది అయ్యేదేగదయ్యా".

4. "అన్ని జీవులలో వెంకయ్య వున్నాడని రాసుకో" అది ప్రతి ఒక్కరికీ అనుక్షణము గుర్తుండవలసిన విషయం. సద్గురువు విశ్వరూపుడనీ, సర్వ ప్రాణులను వారే పరివేష్టించి యున్నారనీ, ఏ ప్రాణిని ఆదరించినా బాధించినా అది సద్గురునికే చెందుతుందనీ అనుక్షణం గుర్తుంచుకొని జీవితాన్ని సాగిస్తే గురుకృప సదా మనకు లభిస్తుంది.

5. "మైసూరు మహారాజు కనిపిస్తే మనకేమొస్తుంది. మనం చేసుకున్నదే గదా మనకు" మైసూరు మహారాజా లాంటి సద్గురువు తారసిల్లినా మనం సాధన చేసి అర్హత సంపాదించనిదే వారు కృపచూపినా మనం నిలుపుకోలేమని అర్థం.

6. "అందరికీ పంట పండించాను, దాన్ని దొంగలు పడి దోచుకోకుండా చూచుకోండి". మనలోని దుర్గుణాలే దొంగలు.

7. మీరు నన్ను వదలినా నేను మిమ్మల్ని వదలను.

8. వెయ్యి గొర్రెలలో వున్నా మన గొర్రెను కాలు పట్టి లాక్కురావచ్చు.

9. అందరినీ సమానంగా చూచుకుంటే భగవంతుడు కనిపిస్తాడు.

10. ఆకలిగా లేదు, నాకు అన్నం వద్దు అనే భక్తుణ్ణి, కొద్దిగానన్నా తినమని

కొందరు బ్రతిమిలాడుతున్నారు. వారితో శ్రీస్వామివారు ఇట్లా అన్నారు, "మందం, బంధం" మందాకలితో భోంచేస్తే అది పరిగ్రహమై బంధ హేతువౌతుంది. ప్రకృతి శక్తుల రూపంలో మనకు ఆహారాన్ని ప్రసాదించే భగవంతునికి ఋణపడుతామన్న మాట.

11. వెంకయ్య పేరుమీద పిడికెడు మెతుకులు పెట్టిన వారికి, తెచ్చిన వారికి వారి మంచి చెడ్డలన్నీ మనమే చూడొద్దయ్యా.

12. "మాకేదన్నా బోధించండి స్వామీ" అంటే "చెప్పేదేముంది. చూచి నేర్చుకోండి" అన్నారు. వారిని చూచి మనమేమి నేర్చుకోవాలో "అవధూత బోధామృతం" లో విపులంగా వివరించబడింది.

13. మంత్రోపదేశం చేయమన్న భక్తునితో శ్రీస్వామివారు "మంత్రమెక్కడుంది, తంత్రమెక్కడుంది? చూచుకుంటూ పొయ్యేదే గదయ్యా" అన్నారు. మనలో దుర్గుణాలు చేరకుండా చూచుకుంటూ సద్గురుడు ఆచరించి చూపిన శుభ్రమార్గాన్ని చూచుకుంటూ, ఆ మార్గంలో నడవడమే మన కర్తవ్యమన్న మాట.

14.సన్యాసులు ధర్మంగా ఉండటంలో గొప్పేముందయ్యా? సంసారంలో ధర్మంగా ఉండటమే గొప్ప.

15. వడ్డీ విషయంలో కూడా ధర్మంగా ఉండాలయ్యా.

16. మాకేమైనా బోధిచండి స్వామీ అంటే "సత్యం, ధర్మం, సంపన్నత్వం, సాధారణత్వం, సద్గురు సేవ సాధించండి" అన్నారు.

**సంపన్నత్వమంటే దైవీసంపద లక్షణాలు, సాధారణత్వమంటే సర్వవిధముల గర్వము, అహంకారము లేకుండా "అల్లామాలిక్" అనే భావాన్ని ఆచరణలో జీర్ణించుకొని యుండటం. సద్గురు సేవ అంటే సద్గురువు విశ్వరూపుడని, ఏ జీవిని ఆదరించినా హింసించినా అది గురువుకే చెందుతుందనే ఎరుకతో ప్రతిక్షణం జీవించటం.**

107

17. నిత్యమూ తమలో తాము కలహించుకొనే తమ సేవకులలో కొందరిని ఏకాంతంగా పిలిచి "నోరు విప్పకూడదయ్యో" అని ఒకే మాట బోధించేవారు.

18. 'నా ఆరోగ్యం సరిలేదు. అక్కడ నొప్పి ఇక్కడ నొప్పి' అని తనకు చెప్పుకొనే సేవకులతో శ్రీస్వామివారు "నొప్పి ఎంత అనుభవిస్తే అంత మంచిది

గదయ్యా" అనేవారు.

19. పావలా దొంగిలిస్తే పది రూపాయలు నష్టపోతుండ్లాయ్యా!
20. మనిషైపోతే మనిషిగానే వస్తుండ్లా.
21. తప్పు చేసిన సేవకులను శ్రీస్వామివారు మందలించలేదని తలచినవారితో "పొయ్యే వాళ్ళను పోనిచ్చేదే గదయ్యా" అన్నారు.
22. ముందు ముందు తెడ్డు తగలని అన్నం తింటారయ్యో అన్నారు.
23. ఆశబోతే అంతా పోతుండ్లాయ్యా. ఇది సర్వశాస్త్రాలసారము.
24. దారం తెగిపోకుండా చూచుకుంటే నేనెప్పుడూ మీతోటే ఉండ్లాయ్యా.
25. ఒకరిని పొమ్మనే దాని కంటే మనమే పోవడం మంచిదయ్యా.

